కర్షకా మేలుకో..

- ఈ–క్రాప్ నమోదుకు ముగుస్తున్న గడువు
- ఈ నెల 30తో ఖరీఫ్ సీజన్ పూర్తి
- నమోదు చేయిస్తే రైతులకు బహుళ ప్రయోజనాలు

తుని రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఈ–పంట నమోదు (ఈ–క్రాప్ బుకింగ్)కు ఈ నెల 30తో గడువు ముగుస్తుంది. ఆగస్టులో వేసిన పంటలను రబీ పంటలుగా అధికారులు గుర్తించనున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన రైతులు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తయ్యిందీ, లేనిదీ నిర్ధారించుకోవాల్సి ఉంది. ఇందుకు బయోమెట్రిక్‌తో ఈ–కేవైసీ పూర్తి చేయించుకోవాలని అధికారులు సూచించారు. పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట దిగుబడులు, పంట విక్రయాలకు ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి. ఆగస్టు నుంచి వేసిన పంటలను రబీ సీజన్‌గా గుర్తించి నవంబర్, డిసెంబర్ నెలల్లో మరోసారి ఈ–క్రాప్ బుకింగ్ చేపడతామని అధికారులు తెలిపారు.

మెట్టలో పూర్తికాని వరినాట్లు

ఖరీఫ్ సీజన్‌కు మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణ వర్షాలు సైతం కురవకపోవడంతో తుని సబ్‌డివిజన్‌లో లోటు వర్షపాతం నమోదైంది. వేలాది మంది రైతులు ఖరీఫ్ వరినాట్లు పూర్తి చేయలేకపోయారు. వరినాట్లు వేసేందుకు వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో మెట్ట రైతులు ఇంకా వరుణుడి రాక కోసం ఎదురు చేస్తున్నారు. పంపా, తాండవ రిజర్వాయర్లు, పుష్కర ఎత్తిపోతల పథకం, పీబీసీ కాలువల నుంచి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు చేరడం లేదు. దీంతో ఖరీఫ్ నాట్లు వేసేందుకు రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

25 వేల ఎకరాల్లో..

తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 35 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి నాట్లు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ 25 వేల ఎకరాల్లో నాట్లు పడినట్టు ఈ–క్రాప్ బుకింగ్‌తో స్పష్టమైంది. ఖరీఫ్ నాట్లు పూర్తయిన భూముల్లోనూ, 40,327 ఎకరాల ఇతరేతర వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తయ్యింది.

ఖరీఫ్‌లో ఈ–క్రాప్ బుకింగ్ వివరాలు

మండలం	వరి పంటకు నమోదు (ఎకరాల్లో)	ఇతర పంటలకు నమోదు (ఎకరాల్లో)
తుని	3707	12524
కోటనందూరు	246	4294
తొండంగి	9925	5080
రౌతులపూడి	2233	11076
శంఖవరం	1128	7353



డి.పోలవరంలో ఖరీఫ్ పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్న వీఏఏ

వందశాతం నమోదు చేస్తాం



ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలన్నింటికీ ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్నాం. గ్రామాల్లో వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ–పంట నమోదు ప్రక్రియను ఈ నెల 30 వరకు కొనసాగిస్తారు. ఎక్కడైనా పంట నమోదు చేయకపోతే ఆయా రైతులు సంబంధిత అధికారిని సంప్రదించి నమోదు చేయించుకోవాలి. పంట నమోదైనట్టు ఈ–కేవైసీ చేసుకోవాలి. పంట నమోదు ప్రక్రియ పూర్తయితేనే ఫలసాయం విక్రయం, సంక్షేమ పథకాలు అందుతాయి. ఆగస్టు ఒకటి నుంచి వేసే పంటలన్నీ రబీ పంటలుగా నమోదు చేయాల్సి ఉంది. రబీ ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియను ఉన్నతాధికారుల ఆదేశాలతో నవంబర్‌లో ప్రారంభిస్తాం.

– బి.అశోక్‌కుమార్, వ్యవసాయ అధికారి, తుని మండలం

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు



ఒమ్మంగి–శరభవరం ఆర్‌అండ్‌బీ రహదారి పునర్నిర్మాణ పనులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి – శరభవరం రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఒమ్మంగి రాజ్ చెరువు నుంచి శరభవరం సమీపంలోని జీడి పిక్కల ఫ్యాక్టరీ వరకూ ఆర్‌అండ్‌బీ రహదారిని పునర్నిర్మిస్తున్నారు. రూ.1.60 కోట్లతో ఈ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ పట్టించుకొన్న దాఖలాలు లేవు. ఫలితంగా ఈ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు నరకం చూశారు. ఈ రోడ్డు దుస్థితిని స్థానిక వైఎస్సార్ సీపీ నేతల ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి రహదారి పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

వెళ్లిరా... వినాయక

- ఘనంగా గణపతి నిమజ్జనాలు
- సందడి చేసిన యువత

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా వినాయకుని విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలుచోట్ల నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. స్థానిక పాత బస్టాండ్, క్వారీ ప్రాంతం, దిబ్బలపాలెం తదితర గ్రామాల్లోని గణేశ్ విగ్రహాలను తీన్‌మార్, బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు.

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, చినశంకర్లపూడి, ఏలూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం వైభవంగా నిమజ్జనం చేశారు. ప్రత్తిపాడులోని కొండవార మలుపు రామాలయం, కొత్తపేట రామాలయం, సచివాలయం, అటవీశాఖ చెక్‌పోస్టు, హైస్కూల్, వసతి గృహం తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన గణపతి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి స్థానిక పోలవరం, పుష్కర కాలువలు, ఉప్పాడ సముద్రతీరం, యర్రవరం ఏలేరు కాలువల్లో నిమజ్జనం చేశారు. స్వామి వారి ఊరేగింపులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ప్రాయశ్చిత్త హోమం

ప్రత్తిపాడులోని తంత్ర గణపతి ఆలయం వద్ద బుధవారం ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మంతెన వెంకట రామరాజు వర్మ దంపతులు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

అన్నవరం: రత్నగిరిపై ప్రతిష్ఠించిన వినాయకులను శనివారం నిమజ్జనం చేశారు. స్వామివారిని ఊరేగింపుగా మొదటి ఘాట్‌రోడ్ మీదుగా టోల్‌గేటు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి మెయిన్ రోడ్ మీదుగా రెండో ఘాట్ రోడ్డు ద్వారా పంపా నదికి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో దేవస్థానం సిబ్బంది, వ్రతపురోహితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర తీరాన వినాయక నిమజ్జనాలు

తొండంగి: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో మండలంలోని సముద్ర తీర ప్రాంతాల్లో బుధవారం గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండలంలోని దానవాయిపేట, అద్దరిపేట, పెరుమాళ్లపురం, యర్రయ్యపేట, పంపాదిపేట సముద్ర తీరాలకు మెట్ట గ్రామాల నుంచి ప్రజలు గణపతి విగ్రహాలను వివిధ వాహనాలపై ఊరేగింపుగా తీసుకొచ్చి సముద్రంలో నిమజ్జనం చేశారు. నిమజ్జనాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు.



ఏలేశ్వరంలో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్తిపాడులో గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



గణపతి ఊరేగింపులో సందడి చేస్తున్న మహిళలు



అన్నవరంలో గణపతిని ఊరేగిస్తున్న దేవస్థానం సిబ్బంది, విద్యార్థులు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ నాయకుడు మాణిక్యం

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు గొర్ల మాణిక్యం అన్నారు. రాష్ట్రంలో 2014 జూన్‌కు ముందు నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కాంట్రాక్ట్ లెక్చరర్లు స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొర్ల మాణిక్యం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం పట్ల సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వాలు ఇదే తరహాలో హామీ ఇచ్చి మోసం చేస్తే సీఎం జగన్ మాత్రం ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో పల్లేటి చంద్రశేఖర్, కొప్పిశెట్టి దొరబాబు, గొర్ల పాపారావు, ముప్పన త్రినేత్ర కుమారి, కంటు శివయ్య, నేమాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన

తుని: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ సూచించారు. స్థానిక రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఒకసారి మద్యానికి అలవాటు పడితే అది మరణంతో సమానమన్నారు. అవగాహన రాహిత్యంతో యువత మద్యానికి, డ్రగ్స్‌కు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు, ఎక్కడికక్కడ డీ అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మద్యం, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు వీరప్రభాకర్, రిటైర్డ్ హెచ్ఎం సుందరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మద్యం వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ సూర్యనారాయణ

టీజే నగరంలో 'కాఫీ విత్ క్లాప్‌మిత్ర'

కోటనందూరు: గ్రామాల అభివృద్ధిలో క్లాప్‌మిత్రల పాత్ర ఎంతో కీలకమని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని టీజే నగరంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 'కాఫీ విత్ క్లాప్ మిత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. వీరి సేవను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, ఉప సర్పంచ్ గుడివాడ రాము, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే అచ్చిరాజు, గిడుతూరి రాంబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పంచాయతీ కార్యదర్శులు కుశిరెడ్డి అప్పలరాజు, రావాడ రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



టీజే నగరంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

అంగన్‌వాడీ కేంద్రాలకు వాటర్ టిన్నుల వితరణ

తొండంగి: మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు దివీస్ ల్యాబొరేటరీస్ కంపెనీ ప్రతినిధులు బుధవారం వాటర్ టిన్నులు వితరణ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత, దివీస్ ప్రతినిధులు దానవాయిపేటలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 20 లీటర్ల వాటర్ టిన్నులను అందజేశారు. రక్షిత తాగునీటిని వాటర్ ఆర్వో ప్లాంట్ల నుంచి తీసుకెళ్లేందుకు అవసరమైన ఏటీడబ్ల్యూ కార్డులను కూడా అందజేసారు. మండల వ్యాప్తంగా 87 అంగన్‌వాడీ కేంద్రాలకు దివీస్ కంపెనీ వాటర్ ప్రతినిధులు అందించడం ఎంతో అభినందనీయమని శ్రీలత అన్నారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు ఈ.నాగరాజు, ఎన్.బాలకృష్ణ, కె.తేజ, ఐసీడీఎస్ సిబ్బంది టి.మంగతాయారు, రమణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



దానవాయిపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వాటర్ టిన్నులు అందించిన దివీస్ ప్రతినిధులు

అక్టోబర్ 2న 'పోలీసు స్పందన'

ప్రత్తిపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక, పోలీసు స్పందన కార్యక్రమాన్ని అక్టోబర్ 2న ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించనున్నట్టు స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

గోకవరం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–2లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు డాక్టర్ ఆలేఖ్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ రాజేశ్వరి, ఎంపీహెచ్ఈఓ శంకర్, అనూష, పవన్, నాగలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

ప్రత్తిపాడు: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా పలు గ్రామాల్లో బుధవారం భారీ ఎత్తున అన్న సమారాధనలు నిర్వహించారు. ప్రత్తిపాడులోని పలు వినాయక మండపాలు, చినశంకర్లపూడిలోని సగర్ల రామాలయం వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు.

కిర్లంపూడి: వినాయక చవితి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అన్నసమారాధనలు నిర్వహించారు. చిల్లంగి రామాలయం, కొత్తపేట, కిర్లంపూడి నంది బొమ్మ సెంటర్లు, కొండయ్యపేట వినాయకుని గుడి వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు చదలవాడ బాబీ, పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, గజ్జనపూడి, యూజీ పురం గ్రామాల్లో బుధవారం అన్న సమారాధనలు నిర్వహించారు. వినాయక చవితి ముగింపు వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని గణపతి మండపాల వద్ద భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

జగ్గంపేట: మండలంలోని మర్రిపాకలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామ సర్పంచ్ జగతం ఆనందరావుకు చెందిన తాటాకు ఇంటికి షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలోని సామగ్రి, డాక్యుమెంట్లు, ఎలక్ట్రికల్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు తెలిపారు. సంఘటన స్థలాన్ని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం పరిశీలించారు.

బాధితుడికి రూ. 50 వేల ఆర్థిక సాయం

జగ్గంపేట: మండలంలోని మర్రిపాకలో అగ్ని ప్రమాద బాధితుడు, గ్రామ సర్పంచ్ జగతాం ఆనందరావును ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తండ్రి, వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు. అగ్ని ప్రమాదం జరిగిన తీరును సర్పంచ్ ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. రెండు బస్తాల బియ్యం, రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అధైర్య పడొద్దని, అన్నివిధాలా ఆదుకుంటామని రామస్వామి సర్పంచ్‌కు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు పెద్దాడ రాజబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, జె.కొత్తూరు సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మర్రిపాకలో కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడి



సి.రాయవరంలో రైతులకు ఎలుకల నివారణ మందు అందజేస్తున్న శాస్త్రవేత్త సీతారామశర్మ



కొలిమేరులో రైతులకు సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్‌కుమార్



కిర్లంపూడిలో రైతులకు ఎలుకల నివారణ మందు అందజేస్తున్న వ్యవసాధికారులు

రౌతులపూడి: రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. రౌతులపూడి, బలరామపురం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో బుధవారం సామూహిక ఎలుకల నివారణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎకరానికి పది గ్రాముల బ్రోమోడయోలిన్ మందును ఎలుకల బొరియల్లో పొట్లాలుగా కట్టి పెట్టాలన్నారు. అనంతరం విషపు ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, రాష్ట్ర వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు వి.భీమరాజు, మానెల్లి వెంకటరమణ, అల్లు సత్యనారాయణ, వ్యవసాయ ఏఈఓ సీహెచ్ గోపీనాథ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరంలో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి ఆధ్వర్యంలో రైతులకు పొలంబడి కార్యక్రమంలో భాగంగా సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామశర్మ మాట్లాడుతూ రైతులందరూ ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలన్నారు. ఎలుకల బొరియల వద్ద ముందుగా తయారు చేసి ఉంచిన విషపు ఎరను పెట్టాలన్నారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బాలాజీనాయక్, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, గుమ్ములూరి వెంకటరమణ, బదిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

తుని రూరల్: రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని కొలిమేరులో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. విషపు ఎర తయారీపై ఏఓ అశోక్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఏఈఓ పి.జగ్గప్పారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు

కోటనందూరు: సామూహిక ఎలుకల నివారణతో రైతులు మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు మెరుగైన దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎలుకల మందు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏఓ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఏఈఓ కేవీ శివకుమారి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కిర్లంపూడి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద బుధవారం రైతులకు సామూహిక ఎలుకల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ జోశా అమృత మాట్లాడుతూ ఎలుకల కారణంగా వరి పంటకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైతులందరూ ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలన్నారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఇసుక తరలింపుపై గ్రామస్తుల ఆందోళన



తిరుమాలిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. శ్మశానవాటికలో ఇసుకను జేసీబీ ద్వారా తరలిస్తుంటే గ్రామస్తులు అడ్డుకున్నారు. కొందరు అక్రమార్కులు శ్మశాన వాటికలో ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. శ్మశాన వాటికలో ఇసుక తరలిస్తే తాము మృతదేహాలను ఎక్కడ ఖననం చేయాలని ప్రశ్నించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి



మాసంపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: పత్తి సాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని మాసంపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో పత్తి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట వేసిన 45 రోజుల్లో గులాబీ రంగు ఆశిస్తుందన్నారు. ఈ పురుగు పువ్వుల్లో పుప్పొడిని నాశనం చేయడంతో దిగుబడి తగ్గిపోతుందన్నారు. గులాబీ రంగు పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలను అమర్చాలని సూచించారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: మండలవ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఎండకాయడంతో ప్రజలు ఉక్కపోతకు గురై ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేద తీరారు. కొద్ది రోజులుగా ఎండలకు అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ జె.ఝాన్సీరాణి బుధవారం తెలిపారు. గోకవరంలోని గుమ్మళ్లదొడ్డి–1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు (బీసీ–ఈ) ఖాళీగా ఉందన్నారు. స్థానిక వివాహితులై పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రత్నగిరిపై లక్ష్మీగణపతి హోమం



హోమం జరిపిస్తున్న పండితులు

అన్నవరం: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని బుధవారం సత్యదేవుని సన్నిధిలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఉదయం 9 సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం వద్ద పండితులు లక్ష్మీ గణపతి హోమం ప్రారంభించారు. 11.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వినాయకునికి నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, ఏఈఓలు జగ్గారావు, డీఎస్ కృష్ణారావు, ఫార్మసీ సూపరింటెండెంట్ వి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని రక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథం

కిర్లంపూడి: సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం అన్నారు. స్థానిక సత్యసాయి సేవా సమితి భవనంలో బుధవారం జరిగిన సంఘ జిల్లాస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుకు దూరంగా ఉండాలంటే దేవాలయాలను ఆధారంగా చేసుకుని సత్సంగాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కులాలకు దూరంగా ధర్మానికి దగ్గరంగా ఉండే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పడాల రఘు, వాసంశెట్టి సూర్యవతి, అదట్రా వరహాలుబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.